

అరసవల్లి పాలకమండలి నియామకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి 12 మంది సభ్యులతో కూడిన పాలకమండలిని ప్రభుత్వం నియమించింది. పాలకమండలి చైర్మన్‌గా ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఎక్స్ అఫీషియో మెంబరుగా ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మను నియమించింది. సభ్యులుగా దుక్క గనిరాజు, జలడుగుల శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి, ద్వారపు అనురాధ, జోగి మల్లెమ్మ, నెమలపురి కోటేశ్వర చౌదరి, కొంచాడ సోమేశ్వరరావు, ఓబ్బ లోకేశ్వరి, మండవల్లి రవి, లుకలాపు గోవిందరావును ప్రభుత్వం నియమించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.



అనుసంధానం ఆశలు నెరవేరేదెప్పుడో?

వంశధార, నాగావళి నదుల అనుసంధాన ప్రక్రియను ప్రారంభించి ఐదేళ్లు కావస్తున్నా పనులు నేటికీ పూర్తి కాలేదు. కోర్టు కేసులు, బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో ఆరు నెలలుగా పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణ సంస్థకు బిల్లులు చెల్లించడంతో పనులు కొనసాగించేందుకు అంగీకరించింది. మరోవైపు కొన్నిచోట్ల రైతుల అభ్యంతరంతో కాలువ పనులు ఆగిపోయాయి. అధికారులు జోక్యం చేసుకుని రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చేలా ఒప్పించడంతో ఆ సమస్య కూడా పరిష్కారమైంది. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం, పూర్తిస్థాయిలో డబ్బులు ఇవ్వకపోవడంతో పనుల పూర్తిపై పెద్దగా శ్రద్ధ చూపడం లేదు. దీంతో అనుసంధాన పనులు మందకొడిగా సాగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తికి మరో ఆరు నెలలు పొడిగించి జూన్ వరకు గడువు పొడిగించినా, అప్పట్లోగా పనులు పూర్తి కావడంపై సందేహాలు నెలకొన్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



అసంపూర్తిగా సాగిన కాలువ నిర్మాణ పనులు

- ఐదేళ్లుగా సాగుతున్న పనులు
- డిసెంబరు నాటికి పూర్తి కావాల్సిన ప్రక్రియ
- సకాలంలో పూర్తి కాకపోవడంతో మరో 6 నెలలు పొడిగింపు
- గడువులోగా పనులు పూర్తి కావడంపై సందేహాలు

వంశధార, నాగావళి నదుల అనుసంధానంలో భాగంగా హిరమండలం రిజర్వాయర్ గట్టుకు రెండు తూములు ఏర్పాటు చేసి అక్కడ నుంచి 33.58 కిలోమీటర్ల మేర నారాయణపురం వరకు కాలువ తవ్వాల్సి ఉంది. హిరమండలం వద్ద నీటిని సరఫరా చేసే చోట 43.7 మీటర్ల స్థాయిలో, నారాయణపురం ఆనకట్ట వద్ద కాలువ కలిసే చోట 29.09 మీటర్లు నిర్మించేలా డిజైన్ చేశారు. తద్వారా ఏటవాలుగా నీరు ప్రవహించి ఆనకట్టకు చేరుతుంది. నదుల అనుసంధానం పూర్తి చేస్తే ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లోని ఐదు వేల ఎకరాలకు సాగునీరందుతుంది. దీంతోపాటు నారాయణపురం ఆనకట్ట ప్రధాన కాలువల కింద ఉన్న 37,053 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది.

పెరిగిన ప్రాజెక్టు వ్యయం

వంశధార, నాగావళి నదుల పనులను రూ.84.90 కోట్ల వ్యయంతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 27, 2017లో పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ప్రాజెక్టు పనులను నెల్లూరుకు చెందిన పి.వి రమణయ్య అండ్ కంపెనీకి రూ.57.99 కోట్లకు పనులను అప్పగించింది. అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి కావాల్సి ఉంది. పలుమార్లు ఒప్పంద కాలపరిమితిని పొడిగించిన ప్రభుత్వం, ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేసేలా పొడిగించింది. అంచనా వ్యయాన్ని సవరించి రూ.145.34 కోట్లకు పెంచింది. ఇప్పటివరకు రూ.85.71 కోట్లను వెచ్చించారు.

రూ.11 కోట్లు బిల్లుల చెల్లింపు

అనుసంధాన పనులకు సంబంధించి సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.13 కోట్లు చెల్లించాల్సి ఉంది. గతేడాది డిసెంబర్ వరకు చేపట్టని పనులకు సంబంధించి రూ.11 కోట్లు వరకు చెల్లించింది. మార్చిలో బిల్లులు చెల్లించినా పనులు కొనసాగింపునకు సంబంధిత కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. అధికారులు పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. జలవనరులశాఖ అధికారులు చివరిగా పెనాల్టీ నోటీస్ జారీ చేశారు. కాంట్రాక్టర్ అర్ధాంతరంగా పనులు విడిచిపెట్టి వెళ్లిన సందర్భంలో కొత్తగా పనులు చేపట్టే నిర్మాణ సంస్థకు అయ్యే అదనపు ఖర్చును ప్రస్తుత కాంట్రాక్టరే భరించాల్సి ఉంటుంది. దీంతో పివి రమణయ్య అండ్ కో కంపెనీ దిగొచ్చి పనులను ప్రారంభించింది.

కాలువ పనులకు తొలగిన అడ్డంకులు

బూర్జ మండలం చినలంకాంలో కాలువ నిర్మాణం కోసం దేవాదాయ, ధర్మాదాయశాఖకు చెందిన సుమారు 7.5 ఎకరాలు అవసరమైంది. వంశధార అధికారులు పరిహారం కింద దేవాదాయ, ధర్మాదాయశాఖకు రూ.1.50 కోట్లు చెల్లించేశారు. భూముల్లో 13 మంది రైతులు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. చట్టం ప్రకారం పరిహారంలో 60 శాతం దేవాదాయ, ధర్మాదాయశాఖకు, 40 శాతం కౌలు రైతులకు ఇవ్వాల్సి ఉంది. కౌలు రైతులకు పరిహారం చెల్లింపునకు సిద్ధమవుతున్న తరుణంలో ఆ భూములను ఆలయానికి ఇచ్చిన ధర్మదాత, పరిహారం ఇవ్వాల్సి వస్తే తనకు ఇవ్వాలని, లేకుంటే దేవాదాయశాఖకు చెందాలంటూ కోర్టును ఆశ్రయించాడు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ జోక్యం చేసుకుని రైతులకు న్యాయమైన పరిహారం ఇస్తామంటూ ఒప్పించారు.

వచ్చే ఖరీఫ్ నాటికి సాగునీరు



నదుల అనుసంధానం పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. కాలువ నిర్మాణ పనులకు ఉన్న అడ్డంకులూ తొలగిపోయాయి. ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది జూన్ నాటికి పూర్తవుతుందని భావిస్తున్నాం. ఈ ఖరీఫ్‌కు నీళ్లందించగలమని ఆశిస్తున్నాం.

- డోల తిరుమలరావు, వంశధార ప్రాజెక్టు సర్కిల్ ఎస్ఇ



రైతులతో మాట్లాడుతున్న జెసి నవీన్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- రీ సర్వే వేగవంతం చేయాలి
- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - ఆమదాలవలస, బూర్జ

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయంలో ఓటరుకు ఆధార్ అనుసంధానం, ఓటర్ల నమోదు, అనర్హులను ఓటరు జాబితా నుంచి తొలగింపు వంటి అంశాలపై బిఎల్ఓలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులను అంకితభావంతో సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటరు జాబితా నుంచి అనర్హులని తొలగించాలని స్పష్టం చేశారు. ఇందులో ఎటువంటి అనుమానాలకు తావు లేకుండా సక్రమంగా విధులను నిర్వహించాలన్నారు. 50 శాతం కన్నా తక్కువ పురోగతి ఉన్న 17 మంది బిఎల్ఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు.

రీ సర్వే వేగవంతం చేయండి

భూ సమగ్ర సర్వేను వేగవంతం చేయాలని జెసి నవీన్ ఆదేశించారు. బూర్జ మండలం ఉప్పినివసలలో రీ సర్వేను పరిశీలించారు. రీ సర్వే సమయంలో రైతులతో మాట్లాడి ఎటువంటి వివాదాలకు చోటు ఇవ్వకుండా సక్రమంగా సర్వేను నిర్వహించాలని సూచించారు. సమగ్ర భూ సర్వేతో భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ బి.శాంతి, తహశీల్దార్లు ఎస్.గణపతి, రమణారావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మురళీధర్ నాయక్, ఆర్ఐ వెంకటరమణ, విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్లకు తెలపాలి



ప్రజాశక్తి - శ్రీకాకుళం

సిరియా, టర్కీలో భూకంపం నేపథ్యంలో ఆ దేశాల్లో జిల్లావాసులు ఎవరైనా ఉంటే వారి కుటుంబ సభ్యులు ఆయా మండలాల్లోని తహశీల్దార్లకు వివరాలను తెలియజేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో కోరారు.

కక్షిదారుల నమ్మకం చూరగొనాలి

న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సొంతంగా న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేని వారికి న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాదులకు కేసులను అప్పగిస్తుందని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. న్యాయ సేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాదులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యానల్ న్యాయవాదులు ప్రజలకు ఎంతో సేవ చేసే అవకాశం లభిస్తుందన్నారు. వారికి అప్పగించిన కేసులను సక్రమంగా చేసి కక్షిదారుల నమ్మకం చూరగొనాలన్నారు. పలురకాల కేసులు చేసుకునే అవకాశం ప్యానల్ న్యాయవాదులకు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు సత్యభామ, జ్యోతి, సుధారాణి, రేవతి, అంజనీ కుమార్, దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయసేవాధికారి సంస్థ జిల్లా కార్యదర్శి సన్యాసినాయుడు

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ తెలిపారు. ఆ దిశగా పరిశ్రమల ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఎచ్చెర్ల ఐటిఐ ఆధ్వర్యాన స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీలోని సెమినార్ హాల్‌లో జాతీయ అప్రెంటిస్ అవగాహనా సదస్సు, స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగాల కల్పన అనే అంశంపై బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలన్నారు. ఐటిఐలో శిక్షణ పొందిన తర్వాత పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగావకాశాలు పొంది ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఇటీవల 1,44,85.07 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపిబి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. దీని ద్వారా భారీ పరిశ్రమల ఏర్పాటుకు ఆమోదం లభించిందని చెప్పారు. దీని ద్వారా లక్ష మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం మేర ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చర్యలు చేపడుతున్నారని చెప్పారు.

కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ జిల్లాలో నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు చురుగ్గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా నడిపిస్తున్నారని కొనియాడారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి సాయి శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కడపలోని ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగాలు చేస్తున్న క్రమంలోనూ వారికి అవసరమైన సహకారాన్ని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా అందిస్తామన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఐటిఐలో శిక్షణ పొందిన 30 మంది విద్యార్థులకు కడపలోని షిర్డీసాయి ఎలక్ట్రికల్ కంపెనీలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎస్ శ్రీనివాసరావు, ఢిల్లీ ప్రతినిధి మౌళి, నాయకులు మురళీధర్ బాబా, మూడు జిల్లాల పరిశ్రమల అధికారులు, పలు కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.



అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

నాటుసారా నివారణకు చర్యలు

ప్రజాశక్తి - కవిటి

నాటుసారా అక్రమ రవాణాపై ప్రత్యేక దష్టి సారించినట్లు క్రైమ్ అడిషనల్ ఎస్పి టిపి విఠలేశ్వర్ తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం కవిటి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో నాటుసారా విక్రయాలను నియంత్రించడంలో తమ సిబ్బంది విజయవంతమైనట్టు తెలిపారు. కానీ కొన్ని ప్రాంతాల్లో ఇంకా నాటుసారా విక్రయాలు జరుగుతున్నాయని, దీనిపై ప్రత్యేక నిఘా వేసినట్టు తెలిపారు. మరోవైపు ఇటీవల కాలంలో జిల్లాలో క్రైమ్ రేటు తగ్గిందని తెలిపారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం సిఐ ఆర్ఇసిహెచ్ ప్రసాద్, కవిటి ఎస్ఐ కె రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఎస్‌పి విఠలేశ్వర్

రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం

- ప్రమాద రహిత జిల్లాగా శ్రీకాకుళం
- జిల్లా ఉప రవాణా కమిషనర్ సిహెచ్.శ్రీదేవి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

'రహదారి భద్రత-మీ జీవితానికి సురక్ష' నినాదంతో జిల్లా రవాణా శాఖ చేపట్టిన ప్రత్యేక అవగాహనా సదస్సులు, ర్యాలీలు, సభల వల్ల రహదారి ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని జిల్లా ఉప రవాణా కమిషనర్ సిహెచ్.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఎన్నో నిండు ప్రాణాలు కాపాడగలిగామని తెలిపారు. ప్రమాద రహిత సమాజం కోసం అన్ని వర్గాల సహకారంతో సురక్షిత జిల్లాగా, ప్రమాద రహిత జిల్లాగా రూపొందించడం లక్ష్యమని పేర్కొన్నారు. భద్రతా వారోత్సవాలు వారం రోజుల పాటు మొక్కుబడిగా నిర్వహించకుండా, నిరంతర ప్రక్రియగా చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. తద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలు, పిజి సంస్థలు, ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల్లో పెద్దఎత్తున రోడ్డు భద్రతపై అవగాహన కల్పించామని తెలిపారు. పోలీస్, మెడికల్, ఆర్‌టిసి, ఆర్అండ్‌బి శాఖల సహకారంతో రహదారి భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జాతీయ రహదారిపై ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలు సంభవించేవని తెలిపారు. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. నెలకు సుమారు సరాసరి 30 ప్రమాదాలు సంభవించే జిల్లాలో ప్రస్తుతం 10 నుంచి 15 మాత్రమే సంభవిస్తున్నాయని, వీటిని పూర్తిగా నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. మూడు నెలలుగా సుమారు 500 మంది వాహనదారులు పన్నులు చెల్లించడం లేదని తక్షణమే బకాయిదారులు వాహనాల పన్నులు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మొండి బకాయిదారులపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా బకాయిల వసూళ్లకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.





పందిరిరాట వేస్తున్న దేవాదాయశాఖ సిబ్బంది

శివరాత్రి ఉత్సవాలకు శుభరాట

ప్రజాశక్తి - జలుమూరు

శ్రీముఖలింగంలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న శ్రీముఖలింగేశ్వరుని శివరాత్రి ఉత్సవాలకు మొదటి అడుగు బుధవారం పడింది. ఉత్సవాలు సజావుగా సాగేందుకు, ఎటువంటి అశుభాలు కలగకుండా అంతా శుభంగా జరిగేందుకు సంప్రదాయ బద్ధంగా శుభ రాట వేయడం ఆలయ సంప్రదాయంగా వస్తోంది. అందులో భాగంగా దేవాదాయశాఖ అధికారులు, అర్చకులు బుధవారం ఉదయం ధ్వజస్తంభం వద్ద పందిరి రాట వేశారు. ఉత్సవ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి పి.ప్రభాకర్‌రావు, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపిటిసి కె.హరిప్రసాద్, పురోహితులు బంకుపల్లి భూషణ శర్మ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలి

కృపారాణికి వినతిపత్రం అందజేసిన గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

2020-21, 2021-22 విద్యా సంవత్సరాల్లో రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించాలని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణిని ఎపి ప్రభుత్వ జూనియర్ కళాశాలల గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు బుధవారం కోరారు. టెక్కలి క్యాంపు కార్యాలయంలో కృపారాణిని కలిసి వారు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ జిఒ 147 ప్రకారం వార్షిక వేతనం పది నెలలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మంజూరు చేసినా.. అధికారులు అమలు చేయడం లేదని తెలిపారు.

కృపారాణి స్పందిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యవర్గసభ్యులు, ఎంపిటిసి శ్రీధర్‌రెడ్డి, గుప్తా, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.



కృపారాణికి వినతిపత్రం అందిస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు

150 రోజులు పని కల్పించండి

కేంద్ర బృందం సభ్యులను కోరిన ఉపాధి హామీ కూలీలు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

100 రోజులు పని దినాలు సరిపోవడం లేదని, 150 రోజులు పని దినాలు కల్పించాలని కేంద్ర బృందం సభ్యులు గిరిజా శంకర్‌పాడి, సత్యరంజన్ గౌత్‌కు కూలీలు విన్నవించారు. కేంద్రం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చారు. బుధవారం సంతబొమ్మాళి పంచాయతీలో గత రెండు సంవత్సరాలుగా నిర్వహించిన ఉపాధి హామీ పనులను కేంద్ర బృందం సభ్యులు గిరిజ శంకర్ పాడి, సత్య రంజన్ గౌత్ పరిశీలించారు. రూ.40 లక్షలు విలువైన పనులను పరిశీలించారు. బృందం సభ్యులు ఉపాధి హామీ కులీలతో మాట్లాడుతూ రోజుకు కూలీ ఎంత వస్తుంది? సమయానికి అందుతున్నాయా? అని అడిగారు. పలువురు కూలీలు మాట్లాడుతూ రోజుకు 257 కూలి వస్తోందని, ఇవి సరిపోవడం లేదన్నారు. కనీసం రూ.300 వచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అంతకుముందు పంచాయతీకి వచ్చిన నిధులపై సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎపిడి మురళీకృష్ణ, ఇఒపిఆర్‌డి హనుమంతు శశి భూషణరావు, హౌసింగ్ ఎఇ బి.నర్సింగ్‌రావు, ఎపిఎం సూర్యనారాయణ, ఎఒ వాసునాయుడు, కె.లక్ష్మి, ఇసి మునీంద్ర, పంచాయతీ కార్యదర్శి ఎస్.మల్లేశ్వరరావు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఎల్ఎం బృందం సభ్యులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల అందించే ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పాలతలగాం-2 పరిధిలోని శ్రీకృష్ణాపురం, పాల తలగాంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సరిగ్గా అందుతున్నాయా! లేదా అని అడిగి తెలసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు కుళ్లిన కోడి గుడ్లు ఇస్తున్నారని దువ్వాడ దృష్టికి తేగా, పక్కనే ఉన్న అంగన్వాడీ కార్యకర్తను ప్రశ్నించారు. ఏజెన్సీ ఇచ్చినప్పుడు బాగానే కనిపిస్తున్నాయని, తరువాత పాడైపోతున్నాయని తెలిపారు. ఈ విషయమై జెడ్‌పి సమావేశంలో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కెల్లి జగన్నాయకులు, ఎంపిపి ప్రతినిధి ఎం.అప్పారావు, ఎంపిపిప్రతినిధి నక్క భీమారావు, పొందల రామకృష్ణ, మండల కన్వీనరు కోత సతీష్, మండల మహిళా కన్వీనరు జోగి రాములమ్మ, సర్పంచ్ ఎన్.అప్పన్న, అట్టాడ అప్పలనాయుడు, శ్రీరంగం వీరాస్వామి, బి.లక్ష్మయ్య, సీతారాం, పాపారావు, రాజేంద్రప్రసాద్, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కషి చేస్తున్నారని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే, సాయిరాజ్ అన్నారు. మండలంలోని బూరగాం గ్రామంలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి పైల దేవదాసురెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు గుమ్మడి రామదాసు, వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, ఇచ్ఛాపురం ఎఎంసి అధ్యక్షులు నూతలపాటి బాబురావు, ఎం.మంజు, కురా గౌడో పాల్గొన్నారు.



క్రీడాకారులతో భీష్మ, హెచ్‌ఎం

జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారులు

ఇచ్ఛాపురం: ఈ నెల10వ తేది నుండి 12వ తేదీ వరకు 18వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ మీట్‌కు ఇచ్ఛాపురానికి చెందిన క్రీడాకారులు ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. పాట్నా, బీహార్ రాష్ట్రాల్లో జరిగే పోటీలకు గీత బెహర, నీలాపు దివ్య, సత్యశ్రీ ఎంపికయ్యారు. వీరికి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డివి త్రినాథ్‌రావు, ఎస్‌ఎంసి కమిటీ చైర్మన్ కంబాల భీష్మ, జిల్లా జోన్-1 వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు కె.పద్మనాభంరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు యాదవరావు, సయ్యద్ షాజన్, గణేష్, బత్తుల రామారావు అభినందనలు తెలిపారు.

చిచ్చర పిడుగులు

మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాల. అక్కడ ప్రస్తుతం 22 మంది ఉపాధ్యాయులు, 236 మంది విద్యార్థులతో కూడిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. అక్కడ పదిలో పదిలమైన ఫలితాలు సాధిస్తున్నారు. అలాగే ఆటల్లోనూ పతాకాలను ఎగరవేస్తున్నారు. అలాగే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ర్యాంకులు సాధిస్తున్నారు. ట్రిబుల్ ఐటీలోనూ షీట్లు పొందుతున్నారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి క్రీడా పోటీల్లో పతకాలను కైవసం చేసుకుంటున్నారు. అక్కడ విద్యార్థులు పిల్లలు కాదు... చిచ్చర పిడుగులు.

- అటు ర్యాంకులు... ఇటు పతకాలు
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఐదుగురు విద్యార్థులు

ప్రజాశక్తి - జి.సిగడాం

మండలంలోని సంతవురిటి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు అటు ర్యాంకుల్లో, ఇటు ఆటల్లో రాణిస్తున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వీరంతా చదువులో రాణిస్తూ... క్రీడల్లోనూ ప్రతిభ చూపుతున్నారు. ఉపాధ్యాయులు సహకారంతో నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుంటున్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీల్లో తమ సత్తా చాటుతున్నారు. ఖోఖో, అథ్లెటిక్స్, పరుగు పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. అనుభవిజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయులు టి.యుగంధర్ తోడ్పాటుతో ముందుకు సాగుతున్న పల్లె విద్యర్థులు. ఇక్కడ సీనియర్ ఉపాధ్యాయులు కె.కృష్ణారావు, బి.సురేష్, సిహెచ్.కమలాకరావు, జె.శేఖర్, నారాయణరావు, యోగా టీచర్ సింహాచలం పనిచేస్తున్నారు.

ఒకరు కాదు, ఇద్దరు కాదు ఏకంగా ఈ పాఠశాల నుంచి మొత్తంగా ఐదుగురు విద్యార్థులు ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఆటల్లో పతకాలు సాధించారు. పదో తరగతి చదువుతున్న సిహెచ్.నాని కర్నూలు జిల్లా ఆత్మకూరులో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర ఖోఖోలో విజేతగా నిలిచాడు. 9వ తరగతి చదువుతున్న బి.కీర్తి తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో ఇటీవల నిర్వహించిన అండర్-17 ఖోఖోలో విజయం సాధించింది. 8వ తరగతికి చెందిన కె.శివాజీ ఇటీవల శ్రీకాకుళంలో నిర్వహించిన అండర్-14 ఖోఖో, 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థాయిలో నిలిచారు. ఈ నెల 11న కృష్ణ జిల్లా ఇడుపుగల్లులో నిర్వహించనున్న పదో తరగతి చదువుతున్న ఎన్.శ్రీను అండర్-17 సిమ్మింగ్, 8వ తరగతి చదువుతన్న వి.సాయి అండర్-14లో జిల్లా తరుపున ఆడనున్నారు.

ఏ ఆటైనా...

ఏ ఆటల పోటీకి వెళ్లినా సంతువురిటి స్కూల్‌కి పతకం రావాల్సిందేనని పీడీ బి.యుగంధర్ తెలిపారు. ఇటీవల తొగరాంలో నిర్వహించిన నియోజకవర్గ గ్రిగ్స్ అండర్-17,14 బాలుర ఖోఖో విభాగంలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నారు. అండర్-17,14 బాలికల ఖోఖో విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వంద మీటర్ల పరుగు పందెంలో చంద్రశేకర్ ద్వితీయస్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో భాను ప్రసాద్, శివాజీ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. 400 పరుగు పందెంలో శివాజీ ప్రథమస్థానంలో నిలిచారు. 800 మీటర్ల పరుగు పందెంలో చంద్రశేఖర్ ప్రథమస్థానం, శ్రీధర్ ద్వితీయ స్థానంలో నిలిచారు. డి.బొండపల్లిలో నిర్వహించిన మండలస్థాయి అథ్లెటిక్స్ పోటీలో సినియర్, జూనియర్ బాలురు, బాలికల ఖోఖో విభాగాల్లో ప్రథమస్థానాలు పొందారు. ఇలా ఏకంగా ఈ ఏడాది 42 మంది విద్యార్థులు క్రీడల్లో రాణించారు.



క్రీడల్లో రాణించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు (ఫైల్)

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తా



మాది పేద కుటుంబం. మా అమ్మ, నాన్న వ్యవసాయ పనులు చేస్తూ నన్ను చదివిస్తున్నారు. మా అమ్మ, నాన్న, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్నాను. నేను 9వ తరగతి చదువుతున్నాను. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 ఖోఖోలో ప్రథమస్థానంలో నిలిచాను. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించి అమ్మ, నాన్నలను చక్కగా చూసుకుంటా.

- బి.కీర్తి, 9వ తరగతి

పీడీ ప్రోత్సాహంతోనే...



అమ్మ, నాన్న కష్టపడి నన్ను చదివిస్తున్నారు. నేను 8వ తరగతి చదువుతూ ఇక్కడే హాస్టల్ ఉంటున్నాను. పీడీ యుగంధర్ నన్ను ఎంతగానో ప్రోత్సాహించడంతో 400 మీటర్ల పరుగు పందెంలో, ఖోఖో విభాగంలో రెండుసార్లు రాష్ట్రస్థాయిలో ఎంపికయ్యాను. స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగం సాధిస్తాను. ఉపాధ్యాయులూ సహాయ సహకారాలు అందిస్తున్నారు.

- కె.శివాజీ, 8వ తరగతి

ఉద్యోగాలకు నిలయం

స్వాత్రంత్యం అనంతరం 1966లో ఈ పాఠశాలను స్థాపించారు. అప్పటి నుంచి ఎందరో విద్యార్థులు ఇక్కడ నుంచి సమాజంలో ఎంతో ఉన్నత స్థానంలో ఉన్నారు. కొందరు విదేశాల్లోనూ స్థిరపడ్డారు. అలాగే పోలీసు, ఆర్మీ, ఉపాధ్యాయ వృత్తుల్లో స్థిరపడ్డారు.

అన్ని రంగాల్లో ముందుంటారు

చదువు ఒక్కటే కాదు మా పిల్లలు అన్ని రంగాల్లోనూ ముందు వరుసలో ఉంటారు. పిల్లల నైపుణ్యాలను వెలికితీసి, వారి ఇష్టమైన ఆటల్లో రాణిస్తున్నారు. దీనికి పీడీ యుగంధర్ ప్రోత్సహిస్తున్నారు. పాఠశాల తరుపున అభినందనలు తెలియజేస్తున్నాం. అలాగే విద్యార్థులు మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి. **- టి.జయలక్ష్మి, హెచ్‌ఎం**

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో అధిక లాభాలు

ప్రజాశక్తి- కవిటి

రైతులకు లాభాలు తెచ్చిపెట్టేలా, రైతు శ్రేయస్సే లక్ష్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఇన్‌ఛార్జి సునీల్‌కుమార్, వెలుగు డిపిఎం నాగలక్ష్మి తెలిపారు. మండలంలోని కొబ్బరి, మత్స్యకార సంఘాల రైతులకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఇన్‌ఛార్జి సునీల్‌కుమార్ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఇంటి వద్దనే ఉంటూ చేసుకునే వ్యాపారాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఉన్నతమైనవని తెలిపారు. మండలంలో కొబ్బరి, జీడి, మామిడి వంటి ఉద్యాన పంటలతో పాటు విపరీతమైన మత్స్య సంపద ఉందని, రైతులు వీటిద్వారా మంచి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే అధిక లాభాలు సాధించగలరని ధీమా వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న సునీల్ కుమార్

యూనిట్లు నడిపేవారికి 35 శాతం రాయితీపై రూ.లక్ష నుంచి పది లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. కొబ్బరి, మత్స్యకార రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమను సంప్రదిస్తే వీటిపై పూర్తి అవగాహన కల్పించి, వారికి అన్ని విధాలుగా అండదండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ఈశ్వరరావు, కవిటి ఎపిఎం గోవింద్, మత్స్యకార, కొబ్బరి సంఘాల నాయకులు కాయ భీమ సేన్, బొర్ర కీర్తిరావు, కొబ్బరి, మత్స్యకార సంఘాల రైతులు పాల్గొన్నారు.

క్వారీ పరిశీలన

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అల్లిపల్లిగూడ గిరిజన గ్రామానికి సమీపంలో ఉన్న క్వారీని సరుబుజ్జిలి రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించారు. క్వారీలో బాంబు పేలుళ్లతో గిరిజనులు భయాందోళనలకు గురవుతున్నారని, బాంబు పేలుళ్లను అరికట్టాలని ఆదివాసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి అధికారులను కోరారు. గిరిజనులు నివాస ప్రాంతంలో ఉన్న కారీలకు ఉపయోగిస్తున్న రిగ్ బోర్ల వల్ల ఇబ్బందులు పడుతున్నారని, బాంబులు పేల్చడంతో పెద్ద రాళ్లు వచ్చి పడుతున్నాయని అన్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గిరిజనులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఎన్నిసార్లు అధికారులకు, పాలకులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి క్వారీలో బారి బాంబుల పేలుళ్లను అరికట్టాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆయన తోపాటు శోభ, వెంకటన్న తదితరులు ఉన్నారు.



వివరాలను సేకరిస్తున్న అధికారులు

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని వసపలో శ్రీకాకుళం మెడికవేర్ ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ముందుగా ఈ శిబిరాన్ని పాతపట్నం నియోజకవర్గ వైసిపినాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు ప్రారంభించారు. వైద్యులు చైతన్య, మౌనికసింగ్, బి.అన్నాజి, ఆర్.ప్రశాంత్‌లు 250 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.సర్పంచ్ వలురౌతు ఆఫీస్‌రావు, శ్యామ్‌ప్రసాద్, ఆర్.హరిప్రసాద్, మండ రామ్మూర్తి, చల్లా ధర్మారావు, పడల వెంకటకృష్ణ, ఎల్.ఇందిరామ్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

'అరబిందో' మేనేజర్ హఠాన్మరణం

ప్రజాశక్తి- రణస్థలం



మూర్తి (ఫైల్)

మండలంలోని పైడిభీమవరం అరబిందో పరిశ్రమలో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎం.వి.ఆర్.మూర్తి (బుజ్జి) (34) బుధవారం ఉదయం లక్నోలో హఠాన్మరణం చెందారు. మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురై లక్నో ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. ఈయనకు గతేడాది వివాహమైంది. లక్నోలో అత్తవారింటికి వెళ్లి మృతి చెందడంపై సిబ్బంది విచారం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సంచాంకు చెందిన కీర్తిశేషులు మధురకవి అప్పల నరసయ్య (బొప్ప మాస్టర్) మూడో కుమారుడు. ఉద్యోగరీత్యా స్థానిక అరబిందో పరిశ్రమ లో మేనేజర్‌గా పనిచేస్తూ విశాఖపట్నంలో నివాసం ఉంటున్నారు. ఇటీవల తన అత్తారింటికి లక్నో వెళ్లారు. అక్కడ అనారోగానికి గురికావడంతో ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. లక్నో నుంచి మూర్తి మృతదేహాన్ని గురువారం మధ్యాహ్నం విశాఖపట్నం మధురవాడలో తన నివాసానికి తీసుకొస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మూర్తి మృతిపై అరబిందో పరిశ్రమ యాజమాన్యం, తోటి ఉద్యోగస్తులు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని తెలిపారు.

బైక్ వాలిందా... ఫోన్ గోవిందా

సెల్‌ఫోన్లను కొట్టేస్తున్న దొంగలు

ప్రజాశక్తి - పొందూరు

ద్విచక్రవాహనంపై వచ్చి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తులను అడ్రస్ అడుగుతారు... ఏదో చెప్పబోయే లోగా బైక్ పైనుంచి అదుపు తప్పి పడిపోతున్నట్లుగా నటిస్తారు... పడిపోతున్నారని పొరబడి పొరపాటున పట్టుకోబోయావో జేబులో ఫోన్‌ను పట్టుకుపోతారు. ఈ విధంగా ఇటీవల పొందూరు మండలంలో పలుచోట్ల ద్విచక్రవాహనదారులు ఫోన్లను చోరీ చేస్తున్నారు. పొందూరు పట్టణంలో పోలీస్‌స్టేషన్ రహదారిలో సోమవారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న బట్టల వ్యాపారి రామారావును ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఇల్లు అద్దెకు కావాలని అడిగారు. ఆయన ఏదో చెప్పబోతుండగా బైక్ పైనుంచి పడిపోతున్నట్లుగా నటించడంతో ఆయన పట్టుకోబోయారు. ఇంతలో ఆయన జేబులో ఉన్న సెల్‌ఫోన్ కొట్టేసి పరారయ్యారు.

సెల్‌ఫోన్ పోయిందని గ్రహించిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు నెలల కిందట ఇదే తరహాలో రాపాక కూడలి సమీపంలో అదే గ్రామానికి చెందిన భాస్కరరావు సెల్‌ఫోన్‌ను బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు చోరీ చేశారు. జిల్లాలో ఈ తరహా సెల్‌ఫోన్ల దొంగతనాలు పలుచోట్ల చోటుచేసుకుంటున్నాయి. దీనిపై కొందరు పోలీసులను ఆశ్రయిస్తుండగా, మరికొందరు ఎవరికీ చెప్పుకోలేక అలా ఉండిపోతున్నారు. ఈ తరహా దొంగతనాలకు పాల్పడే వ్యక్తులపై పోలీసులు నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇన్ఫోసిస్‌కు 'కాకినాడ ఆదిత్య' విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

శ్రీకాకుళం: నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న 90 మంది విద్యార్థినులు ఇన్ఫోసిస్ బిపిఎంకు ఎంపికయ్యారు. కళాశాల ఆవరణలో ఇన్ఫోసిస్ బిపిఎం క్యాంపస్ డ్రైవ్‌లో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం చాలా కష్టతరమని, అటువంటి తరుణంలోనూ కాకినాడ ఆదిత్య విద్యా సంస్థలు అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తున్నా యని అన్నారు. ఈ విజయానికి కారణం తమ కళాశాలలో విద్యార్థిని చేరిన మొదటి రోజు నుంచి క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన డిగ్రీ పరీక్షా ఫలితాల్లో కళాశాల జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన సంగతి విదితమేనన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే విజయాన్నందుకున్న విద్యార్థినులకు ఆదిత్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్.నాయుడు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకట అప్పారావు, ప్లేసెమెంట్ ఆఫీసర్ టి.శ్రీనివాసరావు, కంప్యూటర్ విభాగాధిపతి ఎల్.ప్రసాదరావు, సిఆర్‌టి విభాగాధిపతి పి.మంగరాజు పాల్గొన్నారు.

హోండా హెచ్-స్మార్ట్ కీ వాహనం ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఆధునాత టెక్నాలజీలను ఉన్న వాహనాలను వాడాలని, వాహనదారులు హెల్మెంట్ దరించాలని ఉప రవాణా శాఖాధికారి శ్రీదేవి అన్నారు. నగరంలోని బ్లూఎర్త్ హోటల్‌లో హోండా యాక్టీవ్ హెచ్-స్మార్ట్ కీ వాహనాన్ని కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే... ప్రమాదాలను నివారించవచ్చునని పేర్కొన్నారు. ప్రయివేటు స్కూళ్లు, కళాశాలల్లో పనిచేస్తున్న డ్రైవర్లకు మెరుగైన డ్రైవింగ్‌పై శిక్షణ ఇచ్చామని చెప్పారు. లలిత హోండా జనరల్ మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ వెహికల్‌కి రిమోట్ కంట్రోల్ స్మార్ట్ కీ ఉందన్నారు. స్మార్ట్ కీ ఉండటం వల్ల దొంగతనం చేయడానికి వీలుండదని పేర్కొన్నారు. ఈ వెహికల్ నాలుగు రంగుల్లో లభ్యమవుతుందన్నారు. ప్రపంచంలోనే టూ వీలర్ అమ్మకాల్లో హోండా మొదటి స్థానంలో



వాహనం నమూనా కీని అందజేస్తున్న శ్రీదేవి

ఉన్నదని తెలిపారు. యాంటీ టెఫ్ట్‌లాక్ టెక్నాలజీ, స్మార్ట్ ఫైండ్, స్మార్ స్టార్ట్, స్మార్ట్ అన్లాకింగ్, రెండేళ్ల బ్యాటరీ వారంటీ, ఫ్యూయిల్ ఎఫిసియంట్ టైర్స్ వంటి ఫీచర్లతో తయారు చేయబడిందన్నారు. ముందుగా హెచ్-స్మార్ట్ కీ వాహనాన్ని బుక్ చేసుకున్న ముగ్గురు కస్టమర్ల కె.శాంతి, శ్రీనివాసరావు, గౌతమ్‌లకు త్రిష హోండా ఎండీ రావ్, లలితా హోండీ ఎండీ ప్రదీప్ చేతుల మీదుగా వాహనాలను డెలివరీ చేశారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ మంజునాథ్ పాటిల్, త్రిష హోండా మేనేజర్ హరి, సేల్స్‌మేనేజర్ స్వామి, మహేష్ పాల్గొన్నారు.

రాజీ లేని పోరాట యోధుడు అప్పయ్యదొర

88వ జయంతి వేడుకలో వక్తలు



వజ్రపుకొత్తూరు: విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పలాస

ఈ ప్రాంత అభివృద్ధికి రాజీలేని పోరాటం చేసిన యోధుడు, మాజీ ఎంపీ హనుమంతు అప్పయ్యదొర అని పలువురు వ్యక్తులు కొనియాడారు. కీర్తిశేషులు అప్పయ్యదొర 88వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. హనుమంతు బుజ్జి మాస్టర్ ఆధ్వర్యంలో అప్పయ్యదొర మార్గంలోని ఆయన విగ్రహానికి అభిమానులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో దొర ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్మాణాన్ని వైఎస్ఆర్‌తో ప్రారంభించారని అన్నారు. నాటి నంచి ఎందరు ముఖ్యమంత్రులు మారినా ఆఫ్‌షోర్‌కు మోక్షం కలగలేదన్నారు. ప్రజా సమస్యలపై అప్పయ్యదొర ముందుండి ప్రశ్నించే వారిని, ఆయన చూపిన మార్గంలో మనమందరం నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, రిటైర్డ్ న్యాయమూర్తి డి.వాసుదేవరావు, అప్పయ్యదొర సోదరులు హనుమంతు వెంకటరావు దొర, హనుమంతు రంగారావు, పలాస మున్సిపల్ వైస్ చైర్మన్లు బోరా కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, నాయకులు పైల వెంకటరమణ, ఉంగ సాయికృష్ణ, వడిశ బాలకృష్ణ, కౌన్సిలర్లు జి.జోగారావు, పప్పల ప్రసాద్‌రెడ్డి, బల్ల శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

నందిగాం: మండల పరిషత్ కార్యాలయంలో అప్పయ్యదొర విగ్రహానికి ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కె.బాలకృష్ణారావు పూలమాలలువేసి, నివాళులర్పించారు. కీర్తిశేషులు అప్పయ్యదొర లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. ఎస్.భైరాగి, వైస్ఎంపిపి సువ్వారి వసంతకుమార్, చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి ఎ.విష్ణు, బి.బాలకృష్ణ, ఎస్.పాపారావు, పుష్ప సత్యం, చింతాడ శ్రీనివాస్, బి.హనుమంతరావు, బి.సోమేశ్వరరావు, కె.హరిబాబు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: అప్పయ్యదొర ఆదర్శప్రాయుడని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. బెండిగేటు జంక్షన్‌లోని అప్పయ్యదొర విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాల్లో దొర అజాతశత్రువు అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వజ్జ బాబూరావు లోడగల కామేశ్వరరావు పాల్గొన్నారు.

కళింగ సంక్షేమసేవా సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు బండి గేటు జంక్షన్లో అప్పయ్యదొర విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ హేమబాబు చౌదరి, సిపిఐ నాయకులు చాపర వెంకటరమణ, చాపర వేణుగోపాల్, దువ్వాడ శ్రీహర్షనాయుడు, కణితి దామోదర్, పాలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి- రణస్థలం

రైతులు అధునాతన సాంకేతిక పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ చైర్మన్ కె.సతీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని నెలివాడ, కోష్ట, పాతర్లపల్లి గ్రామాల్లో బుధవారం పర్యటించారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా అమలవుతున్న వివిధ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నెలివాడలో తక్కువ నీటితో, దున్నకుండా మొక్కజొన్న సాగు చేస్తున్న రైతు మిత్ర పాంద్రంకి సింహాచలంకు చెందిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రమ, సమయాన్ని ఆదా చేయడానికి వీలైన సాంకేతికతను అవలంబించాలన్నారు. వరికోతల అనంతరం పర్యావరణ హితమైన దున్నకుండా మొక్కజొన్న సాగు (జీరో టిల్లేజ్) వంటి పద్ధతులను అందిపుచ్చుకోవడంతో పెట్టుబడి తగ్గడమే కాకుండా రెండు, మూడు తడుల నీరూ ఆదా అవుతుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జి.వి.అనురాధాప్రసాద్, ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఇఒ) షామిక్ త్రెహన్ అన్నారు. కోష్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పిల్లలతో ముఖాముఖి సంభాషించారు. అనంతరం పాతర్లపల్లి ప్రాథమిక



యంత్రాలను పరిశీలిస్తున్న అనురాధాప్రసాద్

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యాధికారలతో కలిసి ఆధునికీకరణ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ సీనియర్ డైరెక్టర్ కె.వి.యస్.ఎన్.రాజు, డాక్టర్ ఫౌండేషన్ సిఒఒ ప్రణవ్ చౌదరి, సీనియర్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు, సర్పంచ్ ప్రతినిధి పతివాడ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి- పలాస

మండలంలోని లొద్దభద్రకు చెందిన పులారి జగ్గారావు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వంకల కూర్మారావు ఈ విషయాన్ని యాదవ సంఘం నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో యాదవ సంఘం ఆధ్వర్యాన మన్యయాల శ్రీనివాసరావు ఆ కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో లొడగల కామేశ్వరరావు, డొక్కరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితులు

తులసిపేట దళితుల ధర్నా

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని చిట్టేవలస రెవెన్యూ పరిధిలోని డి పట్టా భూములను సర్వే చేసి ఇవ్వాలని కోరుతూ తులసిపేటకు చెందిన దళితులు డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యాన బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ గతంలో తమకు ల్యాండ్ సీలింగ్ భూములకు డిపట్టాలు అందించారని, కొన్నేళ్ల తరువాత గ్రామ పెత్తందారులు దౌర్జన్యంగా భూములు తీసుకొని సాగు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 20లోగా తమ భూములు తమకు అప్పగించకపోతే రిలే దీక్షలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ నాయకులు పి.పోలారావు, ఎడ్ల గోపి, షణ్ముఖరావు, సింహాచలం, రామారావు, వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రేవతి

ప్రజాశక్తి- లావేరు

పరీక్షల్లో తప్పిపోయామని, సెల్‌ఫోన్ ఇవ్వలేదని విద్యార్థి, భర్త వేధిస్తున్నారని భార్య, ప్రేమ విఫలమైందని ప్రేమికులు, జీవితంలో విరక్తి కలిగిన ఓ నిరుద్యోగి ఇలా ఎందరో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇలా నిండు జీవితాన్ని బలితీసుకోవడం సరికాదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రేవతి అన్నారు. లావేరు శాఖాగ్రంథాలయం 37వ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆత్మహత్యల నివారణపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆత్మహత్య ఆలోచన వచ్చినప్పుడు కాసేపు అలా బయటకు వెళ్లి ఏకాంతంగా గడపాలన్నారు. శ్వాసపై ధ్యాస ఉంచి పది నిమిషాలు మౌనంగా ఉన్నట్లయితే ఆత్మహత్యకు పూనుకోరని అన్నారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో రవికుమార్ ప్రథమ, కళ్యాణి ద్వితీయ, స్వాతి తృతీయ స్థానాల్లో నిలిచారు. అనంతరం విజేతలకు గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శివకుమార్, సన్యాసిరావు, ఈశ్వరరావు, రోహిణి భవాని, శోభారాణి పాల్గొన్నారు.

కళాసీ హక్కుల సాధనకు పోరాటం

మెళియాపుట్టి: కళాసీల హక్కుల సాధనకు పోరాటం అవసరమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య పిలుపునిచ్చారు. బుధవారం చేపర సిఐటియు కార్యాలయంలో కళాసీల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాసీలకు కూలి రేట్లు పెంచాలని, బీమా సౌకర్యంతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం మార్గమని అన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలాకి ప్రసాదరావు, కళాసీ యూనియన్ నాయకులు, కళాసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూరయ్య

సుందరాడలో శ్రీకాంత్ పర్యటన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని సుందరాడ, పాలెం, పెద్ద పద్మాపురం, మారేడుకోట గ్రామాల్లో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ బుధవారం పర్యటించారు. సుందరాడ సర్పంచ్ మామిడిపల్లి ధర్మారావు ఆహ్వానం మేరకు సుందరాడలో పర్యటించారు. గ్రామంలో మామిడి శ్రీకాంత్‌కు ఘన స్వాగతం పలికి, నీరాజనాలు పలికారు. పాలెం గ్రామానికి చెందిన బాలరాజు కుటుంబాన్ని కలుసుకున్నారు. కొత్త మామిడికోట గ్రామానికి చెందిన ధనుంజయరావు ఇటీవల అనారోగ్యం బారిన పడ్డారు. ఆయన కుటుంబాన్ని శ్రీకాంత్



వృద్ధురాలితో మాట్లాడుతున్న శ్రీకాంత్

పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు, సర్పంచులు పెద్దింటి చంద్రరావు, ఎస్.గౌరీస్, ఎస్.అప్పారావు, రంగారావు, ధర్మారావు, ఎంపిటిసి సభ్యులు ఎస్.రవికుమార్, ఉర్లన రుషి, బాలరాజు, జగ్గారావు, చిన్న, కరుణ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఎంపీ నిధులతో గ్రామాభివృద్ధి

ప్రజాశక్తి- కవిటి

ఎంపీ నిధులు గ్రామాభివృద్ధికి దోహదపడతాయని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని నెలవంక పంచాయతీలో ఎంపీ లాడ్స్ రూ.5లక్షలతో సామాజిక భవనానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ ఎంపీ నిధులతో ఏదో ఒక కార్యక్రమం చేపట్టామని తెలిపారు. నియోజకర్గ ప్రజలు కోరిన వెంటనే స్పందించి ఉదారంగా నిధులు మంజూరు చేస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడుకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నెలవంక సర్పంచ్ కుమార్ మోహన్‌రెడ్డి, టిడిపి నాయకులు బెందాళం రమేష్, బాసుదేవ్ ప్రధాన్, బార్ల చినబాబు, తట్ట హేమదాస్, దొండపాటి నారాయణ, లొట్టి బాలరాజు, హరికష్ణ బిసాయి తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న చైర్మన్ గిరిబాబు

అభివృద్ధి పనుల్లో అలసత్వం తగదు

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

మున్సిపాలిటీ అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాసనగర్ సచివాలయంలో సుబ్బమ్మ క్వార్టర్స్ వీధిలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.6.70 లక్షలతో 80 మీటర్ల మేర రహదారి పనులకు చైర్మన్ భూమి పూజ చేశారు. అంతకుముందు కెటి రోడ్డు డ్రైనేజీ పనులను మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించి, తగు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బోర చంద్రకళ, వైస్ చైర్మన్లు బోరా కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న సర్పంచ్ భానోజీరావు

బంగారంపై తక్కువ వడ్డీలకు రుణాలు ఇవ్వాలి

రణస్థలం : ఈ ప్రాంత ప్రజలకు, వ్యాపారస్తులకు, రైతులకు తక్కువ వడ్డీలకు బంగారు రుణాలు అందించి ఆదుకోవాలని సర్పంచ్ ఆర్గనైజేషన్ సెక్రటరీ, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు కోరారు. మండల కేంద్రంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో బంగారం రుణాలు అందించే బ్రాంచ్‌ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసరాలకు బంగారంపై రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించి బ్యాంకులను అభివృద్ధి చేయాలని కోరారు. మేనేజర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ బంగారంపై ప్రతిఒక్కరికీ రుణాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పిన్నింటి సత్యంనాయుడు, బ్యాంకు సిబ్బంది పి.ఉదయ్‌కుమార్, షేక్ నషీర్ హేమంత్, చిన్నమనాయుడు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఇచ్ఛాపురం: ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపిపి బోర పుష్ప ఆదేశించారు. బుధవారం లొద్దపుట్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజన పదార్థాలు అందించాలి అన్నారు. సుచి, శుభ్రత పాటించాలి అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు. కె.మోహన్‌రావు, ఆసి పురుషోత్తంరెడ్డి, తదతరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న పుష్ప

రక్తదాన శిబిరం విజయవంతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రాణాలను నిలబెట్టే రక్తదానం చేసే ప్రతిఒక్కరూ సూపర్ హీరోలు అని చిన్నపిల్లల వైద్య నిపుణులు, మెడికవర్ డాక్టర్ సీపాన రాజేష్ అన్నారు. ప్రాణదాత ఫౌండేషన్ ఆధ్వర్యాన గురుగుబెల్లి చంద్రశేఖర్ నిర్వహణలో స్థానిక డే అండ్ నైట్ కూడలి వద్ద ఉన్న న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకులో బుధవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం జరిగింది. రాజేష్, మహిళా పారిశ్రామికవేత్త డాక్టర్ యార్లగడ్డ గీతాశ్రీకాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తం కొరత వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి వారందరికీ రక్తదాతలు ఇచ్చే రక్తం సంజీవని అని పేర్కొన్నారు. అత్యవసర స్థితిలో ఉన్న రోగికి రక్తం అవసరం ఉంటుందని, రోడ్డు ప్రమాద ఘటనల్లో గాయపడి సకాలంలో రక్తం అందక చనిపోయినవారు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారని అన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం మరింత మెరుగ్గా ఉంటుందని తెలిపారు. తరచుగా ప్రాణదాత ఫౌండేషన్ ఇటువంటి



రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదానం శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 50 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ టి.మణికంఠ, ప్రాణదాత ఫౌండేషన్ వ్యవస్థాపకులు డోకి శ్రవణ్ కుమార్, సీపాన అప్పలనాయుడు, పైడి ధర్మారావు, పొట్నూరు ప్రతాప్, బి.అప్పలనాయుడు, పేడాడ లక్ష్మణరావు, తిరుపతిరావు, జిల్ ఫౌండేషన్ సత్యసాయి, పోతురాజు శ్రీధర్, శ్రీకాంత్, మణిశర్మ పాల్గొన్నారు.

యాంత్రీకరణతో రైతులకు మేలు

కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఆమదాలవలస

వ్యవసాయ యాంత్రీకరణతో రైతులకు ఎంతో మేలు కలగనుందని కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు, మరమ్మతులు, నిర్వహణ, యాంత్రీకరణ ఎంపికపై రెండు రోజులు పాటు వృత్తి శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు నారు వేసే, వరి కోత కోసే, ఎరువు వేసుకునే యంత్రాలు, పవర్ విడర్ రోటోవేటర్ వంటి పరికరాలను ఎలా వినియోగించుకోవాలి, వాటి ఖర్చుల నిర్వహణ, మరమ్మతులు గురించి వివరించామని తెలిపారు. అనంతరం మండలంలోని కొండవలసలో నాట్లు వేసే యంత్రాన్ని ఉపయోగించి వరి నాట్లు వేయటంపై



ఉబాలపై అవగాహన కల్పిస్తున్న భాగ్యలక్ష్మి

శిక్షణను అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.అనూష, డాక్టర్ ఎస్.నీలవేణి, డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, డాక్టర్ బి.సునీత, డాక్టర్ బి.మౌనిక ఎస్ఎంఎస్ దాము, సూర్యారావు, శివప్రసాద్, మధు పాల్గొన్నారు.

వైసిపి సమావేశానికి డ్వాక్రా మహిళలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలోని వైఎస్ఆర్ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో డ్వాక్రా మహిళలు హాజరుకావడం చర్చనీయాంశమైంది. వైసిపి కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో ఉన్నప్పటికీ సమావేశం విజయవంతం కావాలని డ్వాక్రా మహిళలను రప్పించడం పార్టీలోని ఓ గ్రూపు బహిరంగంగా ఆరోపణలు చేస్తోంది. మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులు వచ్చినప్పుడు సాధారణంగా డ్వాక్రా సంఘాల సభ్యులను పిలవడం సహజం. కానీ విచిత్రంగా పార్టీ శ్రేణులకు రానున్న ఎన్నికలలో దిశా నిర్దేశం చేసే సమావేశానికి కార్యకర్తలు వచ్చి ఉంటే ప్రయోజనం ఉండేది. డ్వాక్రా మహిళలను



సమావేశంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

పిలవడం పార్టీకి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తోందని పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో ఇటువంటి పొరపాట్లు చేయకుండా పార్టీ పెద్దలు చూడాలని పలువురు కోరుతున్నారు. మరో వైపు మెప్మా అధికారులు రావడం విశేషం.



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

సమిష్టిగా పనిచేయాలి

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ఇచ్ఛాపురం: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమిష్టిగా పని చేయాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. బుధవారం స్థానిక వైఎస్ఆర్ కళ్యాణ మండపంలో కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి విజయఢంకా మోగించాలని విజయ, వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్ పిలుపునిచ్చారు. డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేయాలని సూచించారు. అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని చెప్పారు. టిడిపి నేతల దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని అన్నారు. కార్యక్రమంలో నర్తు రామారావు, శాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, దుక్క లోకేశ్వరరెడ్డి, సుగుణ దేవరాజ్, పిలక రాజ్యలక్ష్మి, ఉలాల దివ్యభారతి, స్వర్ణమణి, సాలిన ఢిల్లీరావు, ప్రేమకుమార్, ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సినీ ప్రముఖులకు నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

తెలుగు సినీరంగ దర్శకుల్లో కళా తపస్వి విశ్వనాథ చిరస్మరణీయులని, మరపురాని మృదుమధుర గాయని వాణీజయరాం అని కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం వర్ధమాన గాయకుల ఆధ్వర్యాన సాయిబాబా నేతృత్వంలో నగరంలోని ఓ హోటల్‌లో విశ్వనాథ్, వాణీజయరాం చిత్రపటాలకు బుధవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఏభైకి పైగా విశ్వనాథ్ దర్శకత్వం వహించారని, ప్రతి సినిమా ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసిందని అన్నారు. ఇంటాక్ కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు మాట్లాడుతూ సాంప్రదాయ



మాట్లాడుతున్న హారికాప్రసాద్

కుటుంబం నుంచి వచ్చిన సమాజంలో ఉన్న రుగ్మతలపై తనదైనశైలిలో ధ్వజమెత్తారని అన్నారు. కార్యక్రమంలో స్వీప్ అధినేత కొమ్ము రమణమూర్తి, పాలిశెట్టి మధుబాబు, ఎన్.మోహన్, రౌతు శ్రీనివాసరావు, జేసీస్ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం విశ్వనాథ్ చిత్రాల్లోని పాటలను, వాణీజయరాం ఆలపించిన పాటలను కళాకారులు ఆలపించారు.

జీవామృతం తయారీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

జీవామృతం పంటలకు శ్రీరామరక్ష అని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవి అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన రైతులు 400 లీటర్ల ద్రవ జీవామృతాన్ని చెరకు పంట కోసం బుధవారం తయారు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవామృతం పంటలకు వినియోగించడం వల్ల పంటకు అవసరమైన సూక్ష్మజీవులు ఏర్పడి నేల అభివృద్ధి చెంది పంట దిగుబడిని పెంచుతాయని తెలిపారు. ఎటువంటి ఎరువులు, రసాయనాలు ఉపయోగించకుండా ప్రకృతి సేద్యంలో పంటలను పండించడం వల్ల రైతులకు పంట పెట్టుబడి పూర్తిగా తగ్గి ఆదాయం కనిపిస్తుందని



జీవామృతం తయారు చేస్తున్న రైతులు

అన్నారు. ప్రకృతి సాగులో పండించిన ఉత్పత్తులకు మార్కెట్లో చాలా డిమాండ్ ఉందని అన్నారు. అందువల్ల రైతులందరూ పూర్తిగా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపి ప్రకృతి సేద్య విధానంలో పంటలను పండించాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, రైతులు పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం : అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ ఎమ్మెల్యే విశ్వరాయి కళావతి బుధవారం సందర్శించారు. ఈమెకు ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ జ్ఞాపికను అందజేశారు. అలాగే విశాఖపట్నానికి చెందిన బిక్కిన రామకృష్ణ తిరుపతిరావు, సత్యప్రభావతి దంపతులు దర్శించుకున్నారు. అనంతరం రూ.1,11,111 చెక్కును ఆలయ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి, ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న రజని

ఎరువుల దుకాణాలు తనిఖీ

రణస్థలం రూరల్ : రైతులకు నాణ్యమైన ఎరువులు విక్రాయించాలని శ్రీకాకుళం వ్యవసాయ సంచాకులు బి.రజని అన్నారు. ఎరువుల షాపులు తనిఖీల్లో భాగంగా బుధవారం మండల కేంద్రం జె.ఆర్.పురం, కమ్మసిగడాంలో ఉన్న ఎరువుల షాపులను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైసెన్స్‌లు సక్రమంగా ఉన్నవి, లేనివి రికార్డులను పరిశీలించారు. ఎరువులు స్టాక్, పురుగు మందుల వివరాలు తెలుసుకున్నారు. అన్నీ సక్రమంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతో పాటు మండల వ్యవసాయ అధికారి డి.విజయభాస్కర్ ఉన్నారు.

బాధ్యతగా పనిచేయాలి

కవిటి: విధి నిర్వహణలో సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహిస్తూ బాధ్యతగా పనిచేయాలని కవిటి తహశీల్దార్ రాచర్ల అప్పలరాజు సూచించారు. మండలంలోని వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలతో ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఇటీవల మండలంలోని ఒక సచివాలయంలో జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. తెలియక కొంతమంది సచివాలయ సిబ్బంది చేసిన పనికి తాను బాధ్యత వహించాల్సి వచ్చిందని, భవిష్యత్‌లో ఇటువంటివి పునరావత్తం కాకుండా వ్యవహరించాలని సూచించారు. ఒకవేళ ఏదైనా సందేహం వస్తే సంబంధిత విఆర్‌ఒ, ఆర్‌ఐతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ పైలా సూర్యనారాయణ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ తమ్మినేని రామచంద్రరావు, ఇఒపిఆర్‌డి శివాజీ పానిగ్రాహి, ఆర్‌ఐ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ అప్పలరాజు



కేక్‌ను కట్ చేస్తున్న స్పీకర్ సీతారాం

ఘనంగా స్పీకర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం జన్మదిన వేడుకలను క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచీ నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విచ్చేసి ఆయనకు పుష్పగుచ్ఛాలను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో తమ్మినేని అభిమానులు స్పీకర్‌తో కేక్‌ను కట్ చేయించారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, డాక్టర్ రామ్మోహనరావు పాల్గొన్నారు.

ఆధార్ సీడింగ్ వేగవంతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఓటర్ కార్డుతో ఆధార్ సీడింగ్ వేగవంతం చేయాలని డిప్యూటీ కలెక్టర్ సుమ బాల ఎన్నికల సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులు, రెవెన్యు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం ఆధార్ సీడింగ్‌ను పరిశీలించారు. డెత్ కేసులు, ఆధార్ నమోదుపై సిబ్బంది చేస్తున్న పనులను చూశారు. కార్యక్రమంలో తహశీల్దార్ గురుప్రసాద్, డిటి శ్రీహరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ డ్రైవ్‌కు స్పందన

ప్రజాశక్తి- జి.సిగడాం

స్థానిక మండలంలో మోడల్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఆధార్ డ్రైవ్‌కు స్పందన లభించినట్లు ఆధార్ నిర్వాహకులు పొగిరి రాము తెలిపారు. ఆధార్ సంబంధిత సమస్యలను ఇక్కడ పరిష్కరించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఆధార్ అప్‌డేట్, ఫోన్ నంబరు లింగక్, పేర్లు, పుట్టిన రోజులు మార్పులు, చేర్పులు కోసం ఎక్కువ మంది మార్పులు చేసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అన్నా శామ్యూల్, లంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న విశ్వప్రసాద్

మాజీ ఎమ్మెల్సీ పరామర్శ

బూర్జ : ఇటీవల మృతి చెందిన అల్లెన ఎంపిటిసి వావిలపల్లి శ్రీరామ వరప్రసాదమ్మ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ బుధవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను ఆమె కుమారుడు, టిడిపి మండల అధ్యక్షులు వావిలపల్లి సీతారాంబాబు (రాంజీ)ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతోపాటు టిడిపి నాయకులు ఉన్నారు.